## పెబ్బేరులో ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు, యువతులు

పెబ్బేరు, అక్టోబర్ 22: దేవీ శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని పెబ్బేరులో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక చిన్నచౌడేశ్వరీ ఆలయం వద్ద సాయిగణేశ్ యూత్ ఈ పోటీలను నిర్వహించింది. పెద్దఎత్తున మహిళలు పాల్గొనగా, ప్రతిభ కనబర్చిన వారికి నగదు బహుమతులు అందజేశారు. 8వ రోజు అమ్మవారు మహిషాసురమర్ధినిగా, రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

## జర్నలిస్టులకు పారదర్శకంగా ప్లాట్ల పంపిణీ

- మిగిలిన వారికి త్వరలోనే ప్లాట్ల కేటాయింపు
- అవగాహన లేకుండా అడ్డగోలు ఆరోపణలు సరికాదు

వనపర్తి,అక్టోబర్ 22: మంత్రి సొంత ఖర్చుతో గతంలోనే జర్నలిస్టుల కోసం రెండు లే అవుట్‌లు చేయించి పారదర్శకంగా ప్లాట్ల కేటాయింపు చేశారని ఆదివారం ప్రకటనలో బీఆర్ఎస్ జిల్లా అధికారి ప్రతినిధి, మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మిగిలిన జర్నలిస్టులకు కూడా ప్లాట్లు అందించాలన్న యోచనలో మంత్రి ఉన్నారన్నారు. ప్లాట్లు రాని కొందరు జర్నలిస్టులకు ఆవేదన ఉండటం సహజమని, కానీ జరిగిన ప్రక్రియ మీద అవగాహన లేకుండా పాల్స్ ప్రాపగండ క్రియేట్ చేయడం సమ్మతం కాదన్నారు. అందరికీ రావాలని కోరుకోవడం ఆహ్వానించదగ్గ పరిణామం. రాలేదు కదా రచ్చ చేస్తాం అనడం అభ్యంతరకరమైదని,త్వరలోనే మిగిలిపోయిన జర్నలిస్టులకు కూడా ప్లాట్ల కేటయించడం జరుగుతుందన్నారు.దీనిలో ఎవరి సలహాలో,ఎవరి డిమాండ్లోతో అవసరం లేదన్నారు. ఇప్పటికే జిల్లాలోని మూడు జర్నలిస్టుల సంఘాల నేతలతో చర్చించిన తరువాతనే మొదటి విడుతలో కొంత ప్రాధాన్యత కల్పించడం జరిగిందని,మిగతా వారికి కూడా రెండో విడుతలో త్వరలోనే వారికి అందించేందుకు మంత్రి చొరువ తీసుకున్నారని తెలిపారు.

## ఆర్యవైశ్య విద్యార్థులకు బహుమతులు

వనపర్తి టౌన్, అక్టోబర్ 22 : జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వివిధ కోర్సుల్లో ప్రతిభ చాటిన ఆర్యవైశ్య విద్యార్థులకు పట్టణ అవోపా సంఘం ఆధ్వర్యంలో మెమోంటోలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఇంటర్, డిగ్రీ, ఎంసెట్ తదితర కోర్సుల్లో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమోంటోలను అందజేశారు. కార్యక్రమంలో అవోపా సంఘం మాజీ అధ్యక్షుడు యాదగిరి, గౌరవ అధ్యక్షుడు యాదగిరి, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, దేవరాజు, రామకృష్ణ, శివకుమార్, కృష్ణమోహన్, సాయిరాం, యువజన సంఘం అధ్యక్షుడు వెంకటేశ్, కార్యదర్శి గోవిందుగుప్తా, కిశోర్, మహేశ్, వెంకట్, భాగ్యలక్ష్మి, ఉమావతి, సుప్రియ, మంజుల, వసంత పాల్గొన్నారు.

## ఆర్డీఎస్‌కు 450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అయిజ, అక్టోబర్ 22: కర్ణాటకలోని టీబీ డ్యాం నుంచి విడుదలైన నీరు ఆర్డీఎస్‌కు చేరుతోంది. ఆదివారం ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో 450 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 355 క్యూసెక్కులు నమోదైనట్లు ఆర్డీఎస్ ఏఈ రాందాస్ తెలిపారు. ప్రస్తుతం 6.6 అడుగుల మేర నీటి మట్టం ఉన్నట్లు పేర్కొన్నారు. ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలో ఇప్పటికే సాగు చేసిన పంటలకు నీరు విడుదల చేసేందుకు ప్రభుత్వం 10రోజుల పాటు ఒక టీఎంసీ నీటిని విడుదల చేయాలని ఇండెంట్ పెట్టింది. దీంతో టీబీ బోర్డు అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

# ఇంటింటి ప్రచారంలో గులాబీశ్రేణులు

- ముమ్మరంగా తిరుగుతున్న క్యాడర్



పెబ్బేరు మున్సిపాలిటీలో ప్రచారం చేస్తున్న నాయకులు

పెబ్బేరు, అక్టోబర్ 22: రానున్న శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించే దిశగా పెబ్బేరు మండల బీఆర్ఎస్ శ్రేణులు కదం తొక్కుతున్నాయి. ఇప్పటివరకు ఏ రాజకీయ పార్టీ ప్రచారాన్ని ఇంకా మొదలుపెట్టలేదు. ఆ పార్టీలకు ఇంకా అభ్యర్థులపై స్పష్టత రాకపోవడంతో వారు ప్రచారం జోలికే వెళ్లడంలేదు. కానీ బీఆర్ఎస్ మాత్రం వనపర్తి నియోజకవర్గం నుంచి అభ్యర్థిగా భీఫారం అందుకున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి గెలుపు కోసం ఇప్పటికే ప్రచారాన్ని మొదలు పెట్టింది. ఈనెల 17న నియోజకవర్గ బీఆర్ఎస్ ఎన్నికల సమన్వయకర్త వంగూరు ప్రమోద్‌రెడ్డి పెబ్బేరు పట్టణంలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. స్థానిక అంబేద్కర్‌నగర్‌లోని కర్రెమ్మగుడిలో పూజలు నిర్వహించి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దీంతో ఎన్నికల వేడి రాజుకొని ప్రతిరోజు వార్డుల వారీగా మున్సిపాలిటీలో ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. ఉదయం 7 గంటలకు ప్రచారం మొదలు పెట్టి మధ్యలో ఒక చోట అల్పాహారం తీసుకొని, 11 గంటల వరకు కొనసాగిస్తున్నారు. మిగిలిపోయిన ఇండ్ల వద్దకు సాయంత్రం వెళ్లి కలుస్తున్నారు. ఇదే మాదిరిగా మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ప్రచారం కొనసాగుతోంది. ఆయాగ్రామాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు విధిగా ఉదయాన్నే ప్రచారం రంగంలోకి దిగుతున్నారు.



పెబ్బేరు మండలం బున్యాదిపురంలో ప్రచారంలో పాల్గొన్న నాయకులు

### మ్యానిఫెస్టోపై అవగాహన..

మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆదరించాలని, సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని బలపరచాలని, రెండోసారి నిరంజన్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరుతూ కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. పార్టీ ప్రకటించిన మ్యానిఫెస్టో ప్రతులను ఇంటింటికీ పంపిణీ చేసి, వాటి గురించి వివరిస్తున్నారు. ఆసరా ఫించన్ రూ. 2016 నుంచి రూ.5016 వరకు పెంచనున్నట్లు, ప్రతి తెల్లరేషన్ కార్డు ఉన్న కుటుంబానికి కేసీఆర్ బీమా పేరుతో రూ.5లక్షల బీమా వర్తింపచేయనున్నట్లు, సౌభాగ్యలక్ష్మి ద్వారా పేద మహిళలకు రూ.3వేల పింఛన్ ఇవ్వనున్నట్లు, రూ.400లకే గ్యాస్ సిలిండర్ అందిచనున్నట్లు చెబుతున్నారు. అలాగే, రైతుబంధు సాయం రూ.10వేల నుంచి రూ.16వేలకు పెరగనుందని, కేసీఆర్ ఆరోగ్య రక్ష ద్వారా రూ.15లక్షల వరకు వైద్య సదుపాయం కల్పించనున్నట్లు, రేషన్‌కార్డులపై సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు, స్వశక్తి మహిళా గ్రూపులకు భవనాలు, అగ్రవర్ణ పేదలకు గురుకులాల ఏర్పాటు, ఉద్యోగుల పెన్షన్ స్కీంపై కమిటీ వేయనున్నట్లు బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విషయాన్ని వారు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు.

## కేసీఆర్ సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు

పెద్దమందడి, అక్టోబర్ 22: ఈనెల 26న వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జరిగే కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ , రైతుబంధు సమితి అధ్యక్షుడు జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, వనపర్తి మార్కెట్ చైర్మన్ రమేశ్‌గౌడ్ మండల ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ 26న జరిగే సీఎం కేసీఆర్ సభకు పెద్దమందడి మండలం నుంచి ప్రజలు భారీగా తరలి రావాలని కోరారు. తెలంగాణను నిండా ముంచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అయోమయంలో పడ్డ పరిస్థితి ఉందన్నారు. దొరల పాలన కావాల్నా ప్రజాస్వామ్యం కావాలా అంటు కాంగ్రెస్ పార్టీ ప్రచారం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇవ్వలేదని, అన్ని వర్గాల ప్రజల అలుపెరుగని పోరాటాలు , కేసీఆర్ అమరణ నిరహార ధీక్ష వల్ల తెలంగాణ వచ్చిందని అన్నారు. వచ్చిన తెలంగాణలో కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధిలో దూసుకుపోతుందని అన్నారు. రైతాంగానికి ఎలాంటి లోటు లేకుండా సాగునీరు, రైతుబంధు, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో సాగునీరు కాదు కదా కనీసం తాగునీరు కూడా లేని పరిస్థితి ఉండేదన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కృషితో వనపర్తి జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. మూడు గంటల ఉచిత విద్యుత్ చాలని విమర్శలు చేసిన రేవంత్‌రెడ్డిని ప్రజలు తరిమికొడతారని అన్నారు. తెలంగాణలో 70 పైచిలుకు సీట్లు బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి సింగిల్ డిజిట్ కూడా రాదని అన్నారు. మంత్రి నిరంజన్‌రెడ్డి నాయకత్వంలో వనపర్తి నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలని, మంత్రి నిరంజన్‌రెడ్డిని బారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రి చేసిన అభివృద్దే మరోసారి ప్రజలు గెలిపించుకుంటారన్నారు. సీఎం కేసీఆర్ సభకు భారీగా మండల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నక్క మహేష్, రహీం, సేనాపతి పాల్గొన్నారు.

## చెన్నారంలో బతుకమ్మ సంబురాలు

- ముఖ్య అతిథిగా పాల్గొన్న సింగిరెడ్డి వాసంతి

గోపాల్‌పేట, అక్టోబర్ 22: రేవల్లి మండలంలోని చెన్నారం లో ఆదివారం రాత్రి బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బంతుకమ్మ సంబురాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సతీమణి వాసంతి హాజరయ్యారు. మహిళలతో కలిసి ఆమె బొడ్డెమ్మ ఆడారు. ఈసందర్బంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సర్కార్ అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన సంక్షేమ పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. వనపర్తి నియోజక వర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధిలో ముందువరుసలో ఉంచిన మంత్రి నిరంజన్‌రెడ్డిని ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఈ నెల 26న వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సీఎం కే సీ ఆర్ బహిరంగ సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. గ్రామస్తులకు బంతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బోర్ల భీమయ్య, వైస్ ఎంపీపీ మధుసూధన్‌రెడ్డి, చంద్రశేఖర్, కోఆప్షన్ సభ్యులు ఎండి మతీన్, సర్పంచు రమేష్, సింగిల్ విండో చైర్మన్ రఘుయాదవ్, దొడ్ల రాములు, గోపాల్‌పేట మండల రైతుబంధు సమితి అధ్యక్షులు అడ్డాకుల తిరుపతియాదవ్, మాజీ ఎంపీపీ జానకిరాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ స్వామిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రఘురామారావు, గ్రామ అధ్యక్షులు కురుమయ్య, మహిళా కమిటి అధ్యక్షురాలు శశికళ, అనురాధ, బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు శశివర్ధన్, శివరాంరెడ్డి, బి.రాములు, గిరిబాబు, సురేంధర్, ప్రమీళ, ఉమా, కవిత, మాధవి, రాధ, మధు, సాయి పాల్గొన్నారు.



చెన్నారంలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న వాసంతి